UTF
ఆం.ప్ర. ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్
A.P.UNITED TEACHERS' FEDERATION
Ph No: 27677242 Fax No: 27650366 email: aputf2000@yahoo.com

**ప్రచురణార్థం** తేది: 13.09.2011

# ఎమ్మెల్సీలు, యుటియఫ్ నారాయణ నేతల నిరవధిక దీక్ష విరమణ ఇతర రూపాయలలో ఆందోళన కొనసాగించాలని నిర్ణయం

అప్రెంటిస్ విధానం రద్దు చేసి 2008 డిఎస్‌సి ఉపాధ్యాయులకు పూర్తి జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ గత 8 రోజులుగా నిరవధిక నిరాహారదీక్ష చేస్తున్న యుటియఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. నారాయణ, పిడిఎఫ్ ఎమ్మెల్సీలు కె.ఎస్. లక్ష్మణరావు, వై. శ్రీనివాసులు రెడ్డిలు మంగళవారం మధ్యాహ్నం దీక్షలు విరమించారు. జెఏసీ ఛైర్మన్ వి. గోపాలరెడ్డి, ఎమ్మెల్యే జె. రంగారెడ్డి, ఎమ్మెల్సీలు ఎం.వి.ఎస్. శర్మ, కె. జార్జివిక్టర్, డా॥ ఎం. గేయానంద్‌ల అభ్యర్ధన మేరకు నిరశనకారులు దీక్ష విరమించడానికి అంగీకరించారు. మధ్యాహ్నం 2-45 నిమిషాలకు జెఏసి ఛైర్మన్ గోపాలరెడ్డి, ఎమ్మెల్యే రంగారెడ్డి, ఎమ్మెల్సీ జార్టివిక్టర్‌లు కొబ్బరి నీరు త్రాగించి దీక్ష విరమింపజేశారు. అంతకుముందుగా ఉదయం ఎమ్మెల్యే రంగారెడ్డి, ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, పిడిఎఫ్ ఎమ్మెల్సీలు ఎంవిఎస్ శర్మ, కె. జార్జివిక్టర్,డా॥ గేయానంద్, యుటియఫ్ గౌరవాధ్యక్షులు సిహెచ్. సుభాస్‌చంద్రబోస్, ప్రధానకార్యదర్శి ఐ. వెంకటేశ్వరరావు రాష్ట్ర కార్యదర్శులు పి. మాణిక్‌రెడ్డి, సిహెచ్. రవి తదితరులు ముఖ్యమంత్రిని కలిసి అప్రెంటిస్ సమస్యపై చర్చించారు.

అప్రెంటిస్ రద్దు, 2008 డిఎస్‌సి టీచర్లకు టైం స్కేల్ మంజూరు చేసే విషయంలో నిర్దిష్టమైన ప్రకటన చేసి యుటియఫ్ అధ్యక్షుడు నారాయణ, ఎమ్మెల్సీల దీక్షను విరమింప చేయాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి కిరణ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ అప్రెంటిస్ విధానాన్ని వచ్చే డిఎస్‌సి నుండి రద్దు చేస్తామని, 2008 డిఎస్‌సి వారికి రద్దు చేయాలంటే రు. 1400 కోట్లు ఖర్చు అవుతుందని ప్రభుత్వం భరించలేదన్నారు. ఇంకా న్యాయపరమైన సమస్యలు కూడా వస్తాయని చెప్పారు. అవన్ని సమంజసంకాదని అప్రెంటిస్ టీచర్లకు కనీసం టైం స్కేల్‌లో కనీస వేతనమైనా చెల్లించాలని అభ్యర్థించగా, న్యాయపరమైన సలహా తీసుకొని పరిశీలిస్తానని అన్నారు. కాలయాపనతో కూడిన ప్రభుత్వ వైఖరి ఎమ్మెల్సీలకు, యుటియఫ్‌కు సంతృప్తి కలిగించలేదు. కానీ ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో నిరవధిక దీక్షలను విరమింపజేసి, ఇతర రూపాలలో పోరాటాన్ని కొనసాగించటం మంచిదని అభిప్రాయానికి వచ్చారు.

దీక్షల విరమణ సందర్భంగా జెఏసి ఛైర్మన్ వి. గోపాలరెడ్డి మాట్లాడుతూ జెఏసి ఒప్పందంలో అంగీకరించిన మేరకు ఈ సమస్య పరిష్కారానికి జెఏసి తరపున కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్యే జె. రంగారెడ్డి మాట్లాడుతూ 2008 డిఎస్‌సి అప్రెంటిస్ టీచర్లకు న్యాయం జరిగేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు.

పిడిఎఫ్ ఫ్లోర్ లీడర్ ఎంవిఎస్ శర్మ, యుటియఫ్ ప్రధానకార్యదర్శి ఐ. వెంకటేశ్వర రావులు మాట్లాడుతూ ప్రభుత్వ మొండివైఖరి పట్ల తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారమయ్యే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. తదుపరి కార్యాచరణను త్వరలోనే ప్రకటిస్తామన్నారు.

గత 8 రోజులుగా నిర్వహించిన నిరాహారదీక్షలకు, రాష్ట్రవ్యాప్త ఆందోళనా కార్యక్రమాలలో పాల్గొన్నవారికి, సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

**(ఎన్. నారాయణ)**
అధ్యక్షులు

**(ఐ. వెంకటేశ్వర రావు)**
ప్రధానకార్యదర్శి